క్లుప్తంగా

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా మండలంలోని ఏఏ గ్రామాల్లో నీటి సౌకర్యం లేదో గుర్తించి నివారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మతీన్ అహ్మద్, ఏఈ విశేశ్వరరావు, సర్పంచులు ఉన్నారు.

మురళీగూడలో వైద్యశిబిరం

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 58మందికి వైద్య పరీక్షలను నిర్వహించి 26మంది రక్త నమూనాలు సేకరించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, ఏఎన్‌ఎం లక్ష్మి, హెచ్‌ఏ ధర్మరావు, ఆశాకార్యకర్త పద్మ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంకుసాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజితతో పాటు మహిళలు కలిసి గర్భిణులకు పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుశీల, రమాదేవి, దుర్గ, శారదతో పాటు బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గౌరీశంకర్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, ఇరిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. సర్పంచ్ నర్సంచ్ జంగు, ఉపసర్పంచ్ పెంటయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిప్ప సురేష్, అడ్లూరి కృష్ణంరాజులు కోరారు. మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు స్థలాల మంజూరుతో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్ బోర్కడేకు తన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావ్, సంతోష్‌కుమార్, రమేష్, కార్యదర్శులు సతీష్, వెంకట్‌గౌడ్, రవి, నితీష్, సురేష్‌చారి, సలహాదారులు వేణుగోపాల్, మహేష్, అబ్దుల్ హన్నన్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: దసరా
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బలగం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	80
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజీ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

విద్యార్థులకు భద్రతేది..!

- బడులకు ప్రహరీల నిర్మాణంలో అధికారుల ఉదాసీనత
- రహదారులకు పక్కనే ఉండడంతో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ప్రహరీ లేక సదాశివపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సేదతీరుతున్న పశువులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని చెబుతున్న పాలకులు, విద్యాశాఖ అధికారుల మాటలు నీటిమూటలు గానే మిగులుతున్నాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీలు లేకపోవడంతో అసౌకర్యాలు, అపరిశుభ్ర పరిసరాల మధ్య విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. రహదారికి ఆనుకొని ఉన్న బడులకు ప్రహరీలు లేకపోవడంతో అక్కడి విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది.

ప్రహరీ నిర్మాణాల్లో జాప్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరవుతున్నా రక్షణ గోడలు మాత్రం నిర్మించడం లేదు. కొన్ని పాఠశాలల్లో ప్రహరీలు ఉన్నా గోడలు పగుళ్లు తేలి శిథిలావస్థకు చేరాయి. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సర్పంచులు ప్రహరీల నిర్మాణాల కోసం దరఖాస్తులు పెట్టుకున్నా ఫలితం లేదు. ప్రహరీ లేక గతంలో గుండాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చదువుకుంటున్న విద్యార్థులపైకి పశువులు దూసుకొని రాగా విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. దీంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు చందాలు పోగుచేసి రూ. 30వేలతో పాఠశాల చుట్టూ కంచె ఏర్పాటు చేశారు.

ఇబ్బందుల్లో విద్యార్థులు

మండలంలో మొత్తం 43 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 4 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 32ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇందులో 3120 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 14 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా 29 పాఠశాలలకు ప్రహరీలు, వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ గోడలు లేకపోవడంతో కొందరు ఆకతాయిలు విద్యాలయాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుతున్నారు. పాఠశాలల ఆవరణల్లో పందులు, కుక్కలు, పశువులు స్వైరవిహారం చేస్తున్నాయి. పాఠశాలల ఆవరణలో పశువులు మలమూత్ర విసర్జన చేస్తుండడంతో పారిశుద్ధ్యం గాడి తప్పుతోంది.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీలు నిర్మించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా పాఠశాలకు ప్రహరీ నిర్మించలేదు. దీంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పాఠశాలకు సెలవు రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి.

- సరిత, సదాశివపేట

ప్రహరీలు నిర్మించాలి



ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువవుతోంది. పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నప్పుడు పశువులు వస్తుండడంతో పాఠాలు వినలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రహరీలు నిర్మించాలి.

- జి. బాలు, సదాశివపేట

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించింది. మొదటి విడతలో మండలంలోని 14 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. రెండు, మూడు విడతల్లో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం.

- సోమయ్య, ఎంఈవో, కౌటాల

పాత రేటు ప్రకారమే ఫంక్షన్‌హాల్ కేటాయించాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఫంక్షన్ హాల్‌ను కార్మికేతరులకు పాత రేటు ప్రకారమే కేటాయించాలని గోలేటి సర్పంచ్ పోటు సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏరియా జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సింగరేణి కార్మికులతో పాటు కార్మికేతరుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సింగరేణి కార్మికులు, కార్మికేతరుల కోసం గోలేటిలో ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాల్‌ను నామమాత్రపు అద్దెకు కేటాయించాలని పేర్కొన్నారు. గత నెలలో కార్మికేతరుల అద్దెను రూ. 5వేల నుంచి రూ. 16వేలకు పెంచటంతో గోలేటి ప్రజలు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సాగరమ్మ, దుర్గం శ్రీవాణి, వార్డు సభ్యులు రవినాయక్, స్వప్న, సత్యనారాయణ, సంఘమిత్ర, శంకర్, నాయకులు ఉపేందర్, రవీందర్, కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, ఆసీఫ్, తిరుపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్తు



బహుమతులు అందజేస్తున్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: చదువుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని గన్నారం మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు రతన్ సైన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మామిడిపల్లి రాధాకృష్ణ, టీయూటీఎఫ్ అధ్యక్షుడు కాంతికుమార్, శంకర్, ప్రధాన ఉపాధ్యాయురాలు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

వాంకిడి: మండలంలోని ప్రతీ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఈనెల 14న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువజన సంఘం నాయకులు విలాస్ ఖోబ్రగడె, పితాంబర్ ఉప్రే, అశోక్ మహోల్కర్, సునీల్ దుర్గే, విఠల్, రోషన్, విజయ్ ఉప్రే, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కౌటాల: అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం కౌటాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బౌద్ధ సమాజ్ సంఘం సిర్పూర్ తాలుకా అధ్యక్షులు బసర్కార్ విశ్వనాథ్ తెలిపారు. డాక్టర్ సవ్యశ్రీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తామన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో రేపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువులకు దప్పిక తిప్పలు



దహెగాం వాటర్ ట్యాంకు వద్ద నిర్మించిన పశువుల నీటి తొట్టి

- నిరుపయోగంగా పశువుల తొట్టీలు

మండలంలో నీటి తొట్టీల వివరాలు..	
మంజూరైనవి	81
నిర్మాణ దశలో ఉన్నవి	60
పూర్తయినవి	16

దహెగాం: పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామంలో వాటర్ ట్యాంకులు, చేతి పంపుల వద్ద నీటి తొట్టీలు నిర్మించేందుకు గతంలో శ్రీకారం చుట్టింది. వీటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేస్తోంది. అధికారుల అలసత్వం వల్ల నిర్మాణాలు పూర్తికాక పశువుల దాహార్తి తీరడం లేదు. నిర్మాణం పూర్తయిన తొట్టీల్లో సైతం నీటిని నింపకపోవడంతో పశువులకు దప్పిక తిప్పలు తప్పడం లేదు.

మండలంలో 81 మంజూరు..

మండలంలో మొత్తం 37,742 పశువులు ఉన్నాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 81 పశువుల నీటి తొట్టీలను అధికారులు మంజూరు చేశారు. ఇందులో 16 తొట్టీల నిర్మాణాలు మాత్రమే పూర్తికాగా, నిర్మాణ దశలో 60 ఉన్నాయి. మిగతా 5 తొట్టీల నిర్మాణానికి స్థలం లభించలేదు. నీటి తొట్టీల నిర్మాణాలు జరగకపోవడంతో పశువుల దాహార్తి తీరడం లేదని రైతులు వాపోతున్నారు. ఉపాధిహామీ పథకంలో నిర్మించాల్సిన పశువుల తొట్టీలు రెండేళ్ల క్రితం మంజూరైనా వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టీలు..

మండలంలో ఆయా గ్రామాల్లో నిర్మించిన పశువుల తొట్టీలలో నీటిని నింపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వేల రుపాయల ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటితొట్టీలు లేక ఉదయం మేతకు వెళ్లిన పశువులు వాగులు, ఒర్రెల వద్ద దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల నీటి తొట్టీలు పూర్తి చేయడంతో పాటు నిర్మించిన పశువుల తొట్టీలలో నీరు నింపి దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేస్తాం



మండలంలో నిర్మాణ దశలో ఉన్న పశువుల నీటి తొట్టీలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. పూర్తి చేయాలని ఈజీఎస్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. నిర్మించిన నీటి తొట్టీలలో నీరునింపి పశువుల దాహార్తి తీరుస్తాం. స్థలం దొరకని చోట సైతం గ్రామస్తులతో మాట్లాడి పశువుల నీటి తొట్టీలు నిర్మించేందుకు కృషి చేస్తాం.

- రాజేశ్వర్‌గౌడ్, ఎంపీడీవో, దహెగాం

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



దహెగాం: కేక్ కట్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దహెగాం: గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని కార్యదర్శులు కోరారు. ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యూలర్ చేయాలన్నారు. ఈమేరకు కార్యాచరణను రూపొందించారు. ఈనెల 13న జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, ట్రెజరర్, రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశమై సమ్మె నోటీసుపై చర్చించడం, 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లాస్థాయిలో మీటింగ్ పెట్టి చర్చించడం, 15న ఎంపీడీవో, డీపీవో, కలెక్టర్లకు సమ్మె నోటీసు ఇవ్వడం, 17 నుంచి 21 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించడం, 24న పోస్టు కార్డు ఉద్యమం, 25న డీఎస్‌ఆర్ యాప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయడం, 26న అఫీషియల్ వాట్సాప్, టెలిగ్రాం గ్రూప్‌ల నుంచి బయటకు రావడం, 27న జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ చేసి కలెక్టర్‌కు సమ్మెపై వినతిపత్రం అందజేయడం, 28 నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయాల వద్ద నిరవధిక సమ్మె చేపట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, యూడీసీ నగేశ్, కార్యదర్శుల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, కార్యదర్శులు ప్రణీత్ బాబు, వంశీకృష్ణ, శివకుమార్, రాజేశ్, నరేశ్, సుమలత, లత, జ్యోతి, సౌమ్య, రోహిదాస్ పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని సంఘం నాయకులు అన్నారు. పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని అభివృద్ధి అధికారి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఎంపీడీవో మాధవి, కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, ఎంపీవో రమేశ్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: ప్రభుత్వం వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని చింతలమానెపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎంపీపీ డుబ్బుల నానయ్యకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు ఆసిఫ్ అలీ, ప్రదీప్‌గౌడ్, శంకర్, శివ, అశోక్, కైలాష్, విజయ్, హరిప్రసాద్, రమేశ్, అనూష, మధుకర్, ఇస్తారి, మల్లికార్జున్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని జేపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాంలతో కలిసి కేక్ కట్ చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీలకు వినతిపత్రం అందించారు. జేపీఎస్‌లు వికాస్, ధర్మ, వాజిద్, సతీశ్, శ్రీకాంత్, రమేశ్ ఉన్నారు.



పెంచికల్‌పేట్: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



బెజ్జూర్: కేక్ కట్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెంచికల్‌పేట్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గంగాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): గ్రామపంచాయతీ కార్యదర్శులను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, ఈవో కృష్ణమూర్తి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియామకమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గౌరీశంకర్, మండల కోఆప్షన్ సభ్యులు బాబా సమక్షంలో కేక్ కట్ చేశారు. వెంటనే రెగ్యూలరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జాడి శ్రీకాంత్, రాజేశ్వరి, సుస్మిత, సుమలత, ప్రసాద్, సులోచన, ఆకాశ్, దాయా పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యదర్శులు విలాస్, పోషం ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లోకి చేరి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు సాయికృష్ణ, తిరుపతి, గణేశ్, భాస్కర్, సందీప్, అశోక్, రజిత, రాజేశ్వరి, శాలిని, అంజలి, శ్రావణి, సంధ్య, తేజస్విని పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు ఓపీఎస్‌ల సర్వీసు రెగ్యులరైజ్ చేసేలా కృషి చేయాలని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేశారు. శరణ్య, సాధన, మీనాక్షి, ధనలక్ష్మి, కళ, నీల, శ్రావణ్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్ర విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి మే నెల 18వరకు నిర్వహించే ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్ నుంచి ప్రజాపోరుయాత్ర ప్రారంభించి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ హాజరవుతారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ద్వంద విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపోరు యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, జోగుల మల్లయ్య, బొల్లం పూర్ణిమ, మామిడాల రాజేశం, దాగం మల్లేష్, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, శ్రీనివాస్, వనం సత్యనారాయణ, దాడా మహేందర్‌రెడ్డి, శంకరయ్య, జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఉన్నారు.

'మనఊరు-మనబడి' అక్రమాలపై ఫిర్యాదు

మంచిర్యాలఅగ్రికల్చర్: 'మనఊరు–మనబడి'లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ తాండూర్ మండల బీజేపీ నాయకులు తాళ్లపెల్లి భాస్కర్‌గౌడ్ బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ మండలంలోని రేచిని గ్రామంలో 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న హైస్కూల్ ఐదో తరగతి గదుల నిర్మాణంలో గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదం పొంచి ఉందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



రోడ్డుపై ప్రమాదకరంగా కరెంటు స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామం నుంచి గురుడుపేట గ్రామానికి విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్ వెనుకభాగంలో కట్టి కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై లాక్కెళ్తుండడంతో ప్రధాన రహదారి ధ్వంసమవుతుందని కన్నెపల్లి ఎంపీటీసీ దుర్గం మోతిరాం బుధవారం తెలిపారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.